క్లుప్తంగా

పారిశ్రామిక వేత్తకు అవార్డు



యర్రబాలెం(మంగళగిరి): నగర పరిధిలోని యర్రబాలెం పారిశ్రామిక వాడకు చెందిన పారిశ్రామిక వేత్త సరికొండ రామరాజు 'బెస్ట్ బిజినెస్ మ్యాన్' అవార్డు అందుకున్నారు. ప్రెస్ క్లబ్ వెల్ఫేర్ వరల్డ్ వైడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ రంగాలలో ప్రతిభ కనబరచిన 40 మంది ప్రముఖులకు బుధవారం విశాఖపట్నం లైబ్రరీ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డులు అందజేశారు. అందులో భాగంగా సరికొండ రామారాజు ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ బొకట్‌కుమార్, అనన్య సాయి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. రామరాజును పారిశ్రామిక వాడకు చెందిన పలువురు పారిశ్రామిక వేత్తలు అభినందించారు.

పర్యాటక రంగంలో మెప్మా మహిళలు



తాడేపల్లి రూరల్: పర్యాటక రంగంలో మెప్మా మహిళలకు అవకాశం కల్పించి వారిని ఆర్థికంగా అభివృద్ధి పరచి పట్టణ పేదరిక నిర్మూలన చేసే దిశగా మెప్మా చర్యలు తీసుకుంటుందని సంబంధిత అధికారులు తెలిపారు. బుధవారం మెప్మా కార్యాలయంలో సమావేశమైన అధికారులు మహిళలకు ఉపాధి అంశాలపై చర్చించారు. స్వయం సహాయక బృందాల సభ్యులు టూర్ గైడ్, హౌస్ కీపింగ్, నిర్వహణ, తృప్తి క్యాంటీన్స్, హోమ్ స్టే, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు, మహిళా మార్ట్, ఫుడ్ ట్రక్, గెస్ట్ హౌస్ కేర్ టేకర్, ఫ్రంట్ ఆఫీస్ మేనేజ్మెంట్, ఫుడ్ అండ్ బేవరేజి, సర్వీసెస్, స్ట్రీట్ ఫుడ్ వెండర్, నాచరలిస్ట్, వెహికల్ పార్కింగ్ నిర్వహణలపై మెప్మా సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ అధికారులు లజ్యతినాయుడు, రాజ్యలక్ష్మి, పద్మారాణి, ఎస్. వెంకటేశ్వరరావు, టి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఈత శిక్షణ

తాడేపల్లి రూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని కృష్ణానది కరకట్ట వెంబడి ఉన్న ఆక్వాడెవిల్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు ఈత శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు అసోషియేషన్ కార్యదర్శి రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 14 ఏళ్ల వయసు గల చిన్నారులకు మే 4వ తేదీ నుంచి 25వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రోజూ ఉదయం 5.30 గంటల నుంచి 8.30 గంటల వరకు ఈత శిక్షణ ఉంటుందని.. ఔత్సాహికులైన చిన్నారులు 79810 33007 నంబరులో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావాల్సిన బకాయిల కోసం చేస్తున్న దీక్ష బుధవారం 146వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ.. ఫ్యాక్టరీ కార్మికుల విషయం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సమంజసం కాదన్నారు. సమస్యలను పరిష్కరిస్తామని చెప్తూ కాలయాపన చేస్తున్నారన్నారు. దీక్షలో సీహెచ్ పిచ్చయ్య, ఎం.డి ఇస్మాయిల్, ఎం.గురవయ్య, వై.సాంబశివరావు, కె.ఆదినారాయణలు మద్దతు తెలిపారు. సంఘం నాయకులు ఎం.ఆశీర్వాదం, బి.సూర్యప్రకాశరావు, వై.వెహోషువ, వై.రమాదేవి, ఇ.సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిర్మల ఫార్మశీలో ప్రాంగణ ఎంపికలు



ఆత్మకూరు(మంగళగిరి): మండలంలోని ఆత్మకూరు నిర్మల ఫార్మశీ కళాశాలలో బుధవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. దేశీయ ఫార్మశీ సంస్థ హెటిరో సంస్థ నిర్వహించిన ఎంపికల్లో వివిధ ఫార్మశీ కళాశాలల నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో 128 విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బి.పాములరెడ్డి తెలిపారు. ఎంపికై న విద్యార్థులకు కళాశాల సెక్రటరీ సిస్టర్ నిర్మల జ్యోతి అభినందనలు తెలిపారు.

మూడో తేదీ వరకూ పింఛన్ల పంపిణీ

మంగళగిరి: ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పింఛన్లను మూడో తేదీ వరకూ పంపిణీ చేయనున్నట్లు కమిషనర్ ఆలీంబాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛనుదారులు గమనించాలని కోరారు.

నిర్మాణ దశలోనే కల్వర్టు!



పూర్తికాని కల్వర్టు నిర్మాణం

తాడేపల్లి రూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని ఎప్పటి నుంచో ఉన్న మురుగునీటి సమస్యను పరిష్కరించేందుకు అధికారులు కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టారు. ప్రజలందరూ సంతోషం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో ఆ సంతోషం నీటి మీద బుడగలా మారింది. 5 నెలల క్రితం చిర్రావూరులో గంగాలమ్మ గుడి వద్ద రేపల్లె కరకట్ట ఎక్కే మార్గంలో కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టారు. పనులు చేపట్టి 5 నెలలు అవుతున్నా.. పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామంలో మూడు వైపులా పంట పొలాలు, మురుగునీరు, గ్రామాలలోని మురుగు నీరు, ఈ కరకట్ట వెంబడి ప్రవహించాలి. వర్షాకాలం వస్తే మురుగు నీరు వెళ్లే మార్గం లేక పంట పొలాల్లో నీరు నిలిచి పంటలు పాడైపోతున్నాయి.

చర్యలు తీసుకోవాలి..

కల్వర్టు నిర్మాణం పూర్తికాకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ప్రజలు అధిక సంఖ్యలో పాడి పోషణపై ఆధారపడి జీవిస్తున్నారు. లంక పొలాలకు పశువులను తోలుకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని.. అధికారులు చర్యలు తీసుకుని వెంటనే కల్వర్టు నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ఫిరంగిపురం: మండలంలోని రేపూడి, అమీనాబాద్ గ్రామాల్లో బుధవారం ప్రజలకు సన్‌స్ట్రోక్ (వడదెబ్బ) తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. పాల్గొన్న అధికారులు మాట్లాడుతూ.. తీవ్రంగా ఎండలు ఉన్న సమయంలో ఎక్కువగా తిరగవద్దని చెప్పారు. మాంసాహారం తగ్గించి కూరగాయలను ఆహారంలో తీసుకోవాలన్నారు. నీరు, పళ్ల రసాలు, కొబ్బరినీళ్లు, మజ్జిగ, ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. లేత రంగులో ఉండే పలుచని దుస్తులు ధరించాలన్నారు. రోజూ కనీసం 15 గ్లాసుల మంచినీరు తాగాలని చెప్పారు. ఒక వేళ వడదెబ్బ తగిలిన పక్షంలో ఆ వ్యక్తిని నీడ ఉండే ప్రదేశానికి తీసుకొచ్చి, తడిగుడ్డతో శరీరం తుడవాలని చెప్పారు. చల్లనిగాలి తగిలేలా చూసి ఉప్పు కలిపిన మజ్జిగ, లేదా చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజు నీరు, ఓఆర్ఎస్ ద్రావణం తాగించాలని సూచించారు. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు ఎండలో ఎక్కువగా తిరగవొద్దని చెప్పారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఎంఎల్ హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మే డే

మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట ఉన్న నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం మే డే నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్ బుధవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే మే డే కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహనరావులు పాల్గొంటారని అన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు ఆదిశంకరుల జయంతి వేడుకలు



మాట్లాడుతున్న మాతా శివానంద సరస్వతి

తాడేపల్లి రూరల్: పట్టణంలోని నులకపేటలో చైతన్య తపోవనంలో శుక్రవారం ఆది శంకరాచార్యుల జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నట్లు మాతా శివానంద సరస్వతి తెలిపారు. బుధవారం తపోవనంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆది శంకరాచార్యుల జయంతి సందర్భంగా శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం చిన్నారులతో నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు. భక్తులందరూ పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు.

పిల్లల ఎదుగుదలకు వీబీఎస్ దోహదం



తాడేపల్లి రూరల్: పిల్లలు చిన్నతనం నుంచే ఆధ్యాత్మికత ఎదుగుదలకు విరామ బైబిల్ పాఠశాల(వీబీసీ) దోహదపడుతుందని నూతన యేరూషలేము ప్రార్థనా మందిరంగ దైవసేవకులు ఐజాక్ చార్లెస్ అన్నారు. ఉండవల్లి నూతన యేరుషలేము ప్రార్థనామందిరంలో జరుగుతున్న వీబీసీ కార్యక్రమం బుధవారం ముగిసింది. ముగింపు సందర్భంగా ఉండవల్లి పల్లె, లొద్ది, అమరారెడ్డి నగర్, అంబేడ్కర్ కాలనీలో పిల్లలు ప్రత్యేకంగా కిరీటాలు ధరించి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పప్పెట్‌షో ఆకట్టుకుంది. కార్యక్రమంలో పలువురు సంఘ పెద్దలు, పాస్టర్లు పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డికి చిత్రపటం బహూకరణ



చిత్రపటాన్ని బహుకరిస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా బుధవారం పలువురు నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర మాజీ సివిల్ సప్లైస్ డైరెక్టర్ తనుబుద్ది చంద్రశేఖర్ రెడ్డి ఆయనకు చిత్రపటాన్ని బహుకరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మేరుగ నాగార్జున, రాష్ట్ర జైన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మనోజ్ కొఠారి, రవీందర్ రెడ్డి, అంజిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య సమస్యలతో యువకుడి బలవన్మరణం

తాడికొండ: అనారోగ్య సమస్యలతో యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన తుళ్లూరు మండలం బోరుపాలెంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గారపాటి కోటేశ్వరరావు(30) తల్లిదండ్రులు చనిపోవడంతో అక్క వరలక్ష్మీ వద్ద ఉంటూ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతూ ఇసుక ర్యాంపులోని పూరిపాకలో నివసిస్తున్నారు. అనారోగ్య సమస్య ఎక్కువ కావడంతో బాధలు తాళలేక మంగళవారం పాకలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుడికి వివాహం కాలేదు. సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.శ్రీనివాసరావు తెలిపారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం



తాడికొండ: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని తుళ్లూరు గ్రంథాలయాధికారి టి.గిరిధర్ కుమార్ సూచించారు. తుళ్లూరు శాఖ గ్రంథాలయంలో కొనసాగుతున్న శిబిరంలో 3వ రోజు చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ శిబిరంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని పలు చిత్రాలను గీశారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

మేడికొండూరు: మండలంలోని విసదల గ్రామంలో బుధవారం సీసీ రోడ్లు, జెడ్పీ రోడ్లకు శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాంట్రాకర్ శేషిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి సాయిబాబు, ఇన్యాసి, బూత్ కన్వీనర్ కొటేశ్వరరావు, గ్రామ మాజీ సర్పంచ్ మామిడి సీతారామయ్య, జనసేన మండల సెక్రెటరీ లింగిసెట్టి శివప్రసాద్, అలీ, జమాల్, బి.జె.పి జిల్లా యువమోర్చా ఉపాధ్యక్షుడు బాలకోటయ్య గౌడ్, కూటమి అధికారులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

మేడికొండూరు: నిర్లక్ష్యంగా వాహనం నడిని ఒక వ్యక్తిని తీవ్రంగా గాయపడిచిన సంఘటనలో నిందితుడు వెంకట బాలకృష్ణకు 6 నెలలు జైలు శిక్షతో పాటు రూ.2 వేలు జరిమానాను విధించారు. గుంటూరు 5వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.లత బుధవారం ఈ తీర్పునిచ్చారు. మండలంలోని వరగానికి చెందిన బోడపాటి కిరణ్‌రు బాలకృష్ణ తన వాహనంతో ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ సంఘటనపై కేసు నమోదు కాగా.. నేరం రుజువుకావడంతో బాలకృష్ణకు జైలు శిక్ష, అపరాధ జరిమానా విధించారు.

3న కేఎల్‌యూ క్యాంపస్ ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్

- అతిథులుగా మైక్రోసాఫ్ట్, ఫ్లిప్ కార్ట్, అమెజాన్ కంపెనీ ప్రతినిధులు
- రూ.75 లక్షల ప్యాకేజీ దక్కించుకున్న కేఎల్‌యూ విద్యార్థి



ప్లేస్‌మెంట్స్ సక్సెస్ మీట్ పోస్టర్ ఆవిష్కరించిన కేఎల్‌యూ ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేఎల్ యూనివర్సిటీ విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్ విద్యార్థులు అత్యుత్తమ వార్షిక ప్యాకేజీలతో ప్లేస్‌మెంట్స్ సాధించారని యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సారథివర్మ తెలిపారు. విజయవాడ మ్యూజియం రోడ్డులో ఉన్న యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఈ ఏడాది రూ.75 లక్షల వార్షిక ప్యాకేజీతో తమ విద్యార్థి ప్లేస్‌మెంట్ సాధించటం గర్వకారణమన్నారు. రూ.58 లక్షల ప్రీ ప్లేస్‌మెంట్ ఆఫర్‌తో పాటు తమ విద్యార్థులు అనేక రికార్డ్స్ సాధించారని చెప్పారు. ఈ ఏడాది 500కు పైగా కంపెనీలు యూనివర్సిటీని సందర్శించి రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించాయని, ఆరు వేల మందికి పైగా విద్యార్థులు కంపెనీల నుంచి ఆఫర్ లెటర్స్ అందుకున్నారని, 4700 మంది విద్యార్థులు వివిధ ప్యాకేజీలలో ప్లేస్‌మెంట్స్ పొందారని వివరించారు. రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల లోపు వార్షిక ప్యాకేజీలను 35 మందికి పైగా విద్యార్థులు దక్కించుకున్నారన్నారు. సూపర్ డ్రీమ్ కంపెనీలలో 150 మంది విద్యార్థులు ప్లేస్ అయ్యారని చెప్పారు. టీసీఎస్‌లో ఒకేరోజు 617 మంది, కాప్ జెమినీలో 493 మంది, టెక్ మహేంద్రలో 381 మంది ఆఫర్స్ పొందారన్నారు. ఈ ఏడాది జర్మనీ, జపాన్, సింగపూర్, దుబాయ్, మలేషియా వంటి దేశాల్లో అంతర్జాతీయ ప్లేసెమెంట్స్ దక్కించుకున్నారన్నారు. తమ యూనివర్సిటీ విద్యార్థులు సాధించిన విజయాలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులందరిలో ఉత్సాహన్ని నింపేందుకు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ విజయోత్సవాన్ని మే మూడో తేదీన వడ్డేశ్వరంలోని యూనివర్సిటీ క్యాంపస్ లో నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ ప్లేస్‌మెంట్స్ విభాగం డీన్ ఎన్.బి.వి.ప్రసాద్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రఖ్యాత సంస్థలైన మైక్రోసాఫ్ట్, ఫ్లిప్ కార్ట్, అమెజాన్, సిస్కో వంటి కంపెనీలతో పాటు ప్రముఖ కార్పొరేట్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు కూడా పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో యూనివర్సిటీ నైపుణ్యాభివృద్ధి విభాగం డీన్ డాక్టర్ శ్రీనాథ్, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు, ఎంహెచ్ఎస్ విభాగం డీన్ డాక్టర్ కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.


శివాలయానికి శంకుస్థాపన

మేడికొండూరు: మండల పరిధిలోని జంగం గుంట్ల పాలెం గ్రామంలో బుధవారం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున దేవాలయ నిర్మాణ శంకుస్థాపన అంగరంగ వైభవంగా జరిగింది గ్రామంలోని భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. దంపతులు శంకుస్థాపన పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందించారు.

సమ్మె నోటీసులు అందజేత

మంగళగిరి: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ ఈనెల 20వ తేదీన చేపట్టిన సార్వత్రిక సమ్మె నోటీసులను బుధవారం మున్సిపల్ కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ శకుంతలకు అందజేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న నేపథ్యంలో కార్మిక వర్గాలన్నీ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రశాంతంగా పాలిటెక్నిక్ ప్రవేశపరీక్ష



తెనాలి: రాష్ట్ర ప్రభుత్వం పాలిటెక్నిక్ కోర్సులో ప్రవేశానికి బుధవారం నిర్వహించిన ప్రవేశపరీక్ష తెనాలిలో ప్రశాంతంగా జరిగింది. పట్టణ కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిర మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల, రావి సాంబయ్య మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల, బోసురోడ్డులోని అంబేడ్కర్ కాలేజీలను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటుచేశారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో దాదాపు 600 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలు రాయగా, 60 మంది వరకు గైర్హాజరైనట్టు సమాచారం. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

15 నుంచి క్రికెట్ పోటీలు

తెనాలిరూరల్: తెనాలి ఎన్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలావరణలో ఈ నెల 15వ తేదీ నుండి కేవైఆర్ అండ్ కేబీఎస్ క్రికెట్ లీగ్ పోటీలు నర్వహించనున్నారు. పోటీల బ్రోచర్‌ను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీటీ నాయుడు, మహ్మద్ ఖుద్దూస్, పసుపులేటి త్రిమూర్తి, కృష్ణ బలిజ సంఘం అధ్యక్షుడు కావేటి వేణుగోపాల్, కౌన్సిలర్ అన్నం పిన్నరావు, పట్టెం హరిబాబు, కోలా రాంమూర్తి, బత్తుల నరసింహారావు పాల్గొన్నారు.

తాడికొండ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

తాడికొండ: తాడికొండ నియోజకవర్గంలో పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రకటన విడుదల చేసింది. యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడిగా చుండు వెంకటరెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా రెడ్డి త్రివేణి, రైతు విభాగం అధ్యక్షుడిగా మల్లంపాటి రాఘవరెడ్డి, బీసీ విభాగం అధ్యక్షుడిగా మాయకుంట్ల రాయప్ప, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా పెరికల రాజు, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా పాలపర్తి రామారావు, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షేక్ రబ్బానిని నియమించారు. విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా మోదుల మహేష్‌వర్ధన్, ఆర్టీఐ వింగ్ అధ్యక్షుడిగా మహంగి చెన్నకేశవరావు, వాలంటీర్ విభాగం అధ్యక్షుడిగా షేక్ జుబేర్, గ్రీవెన్‌సెల్ అధ్యక్షుడిగా పఠాన్ సుభానీ ఖాన్, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా దాచేపల్లి నరేంద్రకుమార్ నియమితులయ్యారు. వీవర్స్ విభాగం అధ్యక్షుడిగా పెమ్మిశెట్టి జోసఫ్ శౌరిసాగర్, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడిగా కూరపాటి జయరాజు, అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షులుగా కొప్పుల శిరీష, లీగల్ సెల్ అధ్యక్షుడిగా వేల్పుల రాజు, కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా షేక్ మొహమ్మద్ షరీఫ్, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా ఐనవోలు సుధీర్, మున్సిపల్ వింగ్ అధ్యక్షుడిగా నాయుడు నాగేశ్వరరావులను నియమించారు. ఐటీ వింగ్ అధ్యక్షుడిగా సి.హెచ్.మొహమ్మద్ ఆరీఫ్, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా కొమ్మాలింగారావు, డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడిగా కంతేటి అశోక్, ఇంటిలెక్చువల్ ఫోరం అధ్యక్షుడిగా ఆళ్ల హనుమంతరావు, బూత్ కమిటి వింగ్ అధ్యక్షుడిగా చావల రంజిత్, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా అట్లూరి శ్రీనివాసరావులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

నదిలో మునిగి బాలుడి మృతి

- ధ్యానకేంద్రానికి వచ్చి తిరిగిరాని లోకానికి బాలుడు
- పిరమిడ్ ధ్యాన కేంద్రంలో విషాధ ఛాయలు



మురారి(ఫైల్)

తాడేపల్లి రూరల్: నెల్లూరు జిల్లా వెంకటగిరికి చెందిన బాలుడు తాడేపల్లి పట్టణం పిరమిడ్ ధ్యాన కేంద్రానికి వచ్చి ప్రమాదవశాత్తూ కృష్ణానదిలో మునిగి మృతి చెందాడు. ఎస్ఐ ప్రతాప్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు బాలుడు మురారి(14) తన మేనత్త సుభాషిణితో కలిసి బుధవారం పిరమిడ్ ధ్యాన మందిరానికి వచ్చాడు. సాయంత్రం తోటి వారితో కలిసి కనకదుర్గవారధి సమీపంలో నది వద్ద నీటిలో దిగి ఆడుతుండగా గల్లంతయ్యాడు. సంఘటనా స్థలానికి వెళ్లి వెతకగా మృతదేహం లభించింది. బాలుడి మేనత్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రాష్ట్ర కమ్మవారి సేవా ట్రస్ట్ ఆవిర్భావం



సమావేశమైన కమ్మ సంఘాల ప్రతినిధులు

మంగళగిరి: పట్టణంలోని ఆటోనగర్ రాయల్ కన్వెన్షన్‌లో బుధవారం కమ్మ వర్గానికి చెందిన ప్రముఖుల సమావేశం నిర్వహించారు. గూడూరు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కమ్మవారి సేవా సమైక్య పేరుమీద ట్రస్ట్ ఏర్పాటు చేశారు. ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడిగా గని భాస్కరరావు, అధ్యక్షుడిగా మండవ మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి రమేష్‌చంద్ర, కోశాధికారిగా గూడూరి నాగ కోటేశ్వరరావు, కార్యదర్శిగా సూరపనేని స్వరూపారాణిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో టి.టి.డి బోర్డు సభ్యురాలు అక్కినేని మునికోటేశ్వరరావు, ప్రకాశం జిల్లా కమ్మ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి ఆలా హనుమంతరావు, కన్వీనర్ కాట్రగడ్డ రఘుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

సహాయక పరికరాలకు దరఖాస్తులు

దుగ్గిరాల: దివ్యాగులకు, వయోవృద్ధులకు ఉపకరణాలు, సహాయక పరికరాల పంపిణీ శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 6వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మంగళగిరిలోని ఈద్గా కమ్యూనిటీ హాల్‌లో శిబిరం ఉంటుందన్నారు. తెల్ల రేషన్ కార్డు, 40 శాతం అంగవైకల్యం పత్రాలు, యూనిక్ డిజేబుల్ కార్డు, రెండు ఫొటోలు, సదరం, ఆధార్, ఫోన్ నంబరు వెంటతీసుకుని రావాలని కోరారు. అర్హులైన వారికి పరికరాలు ఎప్పుడు ఇస్తారో తెలియజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్పెల్లింగ్ మాస్టర్‌కు ఘన స్వాగతం



హార్దీకి స్వాగతం పలుకుతున్న బీజేఆర్ కమిటీ సభ్యులు

తెనాలిరూరల్: మాస్టర్ స్పెల్లర్స్ డాట్ కాం ఆధ్వర్యంలో ఏప్రిల్ 28వ తేదీన గుజరాత్‌లోని వడోదరలో జరిగిన జాతీయ స్థాయి స్పెల్లింగ్‌కాంపిటీషన్‌లో పట్టణానికి చెందిన బాలుడు అత్తోట హార్దీ మాస్టర్ స్పెల్లర్స్ అవార్డు గెలుపొందాడు. మంగళవారం రాత్రి తెనాలి చేరుకున్న హార్దీకి బాబు జగ్జీవన్ రామ్ (బీజేఆర్) కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారాఉ. రేస్వే స్టేషనుకు చేరుకుని హార్దీకి పూలమాలలతో స్వాగతం పలికారు. పట్టణ ఐతానగర్‌లోని మాజీ కౌన్సిలర్ అత్తోట వందనం మనుమడు హార్దీ. కొల్లూరులోని ఫో ఫ్రంట్ స్కూల్లో ఐదో తరగతి చదువుతున్నాడు. డిసెంబరులో జరిగిన రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో విజేతగా నిలిచాడు. బాలుడికి స్వాగతం పలికిన వారిలో కమిటీ అధ్యక్షుడు మేకల సురేష్, సిద్దెల కమలాకర్, నలుకుర్తి రమేష్, అత్తోట శరత్, పొన్నెగంటి రమేష్, తెనాఇ జయప్రకాష్, అత్తోట శాయమ్, బొంతా సుధీర్, చొప్పర దిలీప్ ఉన్నారు.

ప్రజ్ఞాచారికి నీతిపూడి స్మారక జాతీయ సాహితీ పురస్కారం



ప్రజ్ఞాచారికి పురస్కారం ప్రదానం

తెనాలి: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎమ్మెల్యే నీతిపూడి గణపతిరావు స్మారక సేవా జాతీయ సాహితీ పురస్కారాన్ని రూరల్ మండలం కొలకలూరు గ్రామానికి చెందిన 'సాహితీ రత్న' నూతక్కి పూర్ణప్రజ్ఞాచారి అందుకున్నారు. కోనసీమ జిల్లా పి.గన్నవరంకు చెందిన మమత స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో ఆ గ్రామంలోని బుధవారం భీమా వెంకటేశ్వర కాంప్లెక్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన వేదికపై ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. స్థానిక ఎమ్మెల్యే గిడ్డు సత్యనారాయణ, న్యాయవాది నీతిపూడి గణపతిరావు, మమత స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, కోరుకొండ జాను, కోట మోహన్‌రావు, వీవీఎస్ బొంతు గణపతిరావు చేతులమీదుగా ఈ గౌరవాన్ని అందజేశారు. ప్రజ్ఞాచారి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన నీతిపూడి గణపతిరావు స్మారక జాతీయ సాహితీ పురస్కారం అందుకోవటం సంతోషంగా ఉందన్నారు.